నేడు మైసమ్మ బోనాలు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ హెచ్‌పీ రోడ్డులోని మైసమ్మ తల్లికి ఆషాఢ మాసం బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తూము జగదీష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, భక్తుల బోనాల సమర్పణ, సాయంత్రం ఫలహారబండి ఊరేగింపు వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

డీవీజీ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని గురుగోవింద్ సింగ్ నగర్ కాలనీలో నివసించే చేరుసింగ్ అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం విషయం తెలుసుకున్న యువ నాయకుడు రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డీవీజీ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.

27 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

మూసాపేట: తెలంగాణ రాష్ట్రంలోని తూర్పు కాపు సామాజిక వర్గంతో పాటు తొలగించిన 27 కులాలను బీసీ జాబితాలో చేర్చాలని టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గోకర్ల లక్ష్మీనారాయణ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితాలోనే ఉండేవని, రాష్ట్రం ఏర్పడిన తరువాత జాబితాలో నుంచి 27 కులాలను తొలగించారన్నారు. శ్రీకాకుళం నుంచి అత్యధికంగా వలస వచ్చిన ప్రజలు గ్రేటర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని, వారు ఆర్థికంగా వెనుకబడి విద్యా, ఉపాధి రిజర్వేషన్లు, ప్రభుత్వం అందించే పథకాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా వారిని బీసీ జాబితాలో చేర్చి వారికి న్యాయం చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అవంతి నగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ, అవంతినగర్ తోట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎస్ఆర్‌లో భాగంగా డాక్టర్ వెంకటరత్నం పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, బీపీ, చర్మ, దంత, కాళ్లు, నేత్ర వైద్యంతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత

నిజాంపేట్: ప్రగతినగర్ సుందరయ్య భవనం కేంద్రంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు వివిధ ఫోరమ్స్ ద్వారా నడుస్తున్నాయి. ప్రగతి టెక్ అకాడమీ ద్వారా వ్యక్తిగత, సామాజిక భవిష్యత్‌కు ఉపయోగపడే టెక్నికల్ కోర్సులు ఉన్నాయి. ఇందులో భాగంగా కంప్యూటర్ బేసిక్స్ ఎమ్మెస్ ఆఫీస్, సీ లాంగ్వేజ్, జావా పైథాన్ ఏఐఅండ్ ఎంఎల్, స్పోకెన్ ఇంగ్లీష్ వివిధ కోర్సులలో పలువురు శిక్షణ పొందారు. శిక్షణ పూర్తి చేసుకున్న టెక్ అకాడమీ విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్‌లను అందజేశారు.

చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఒరాకిల్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ప్రగతినగర్ అంబీర్ చెరువు పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెరువు గుట్టలు, వాకింగ్ ట్రాక్ చుట్టూ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కలుపు మొక్కలను తొలగించారు. చెరువు చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలువురు సూచించారు. కార్యక్రమానికి అంబీర్ వాకర్స్ అసోసియేషన్, యూత్ ఫర్ సేవ, ప్రగతినగర్ లేక్ వ్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, వీటి విపో వాలంటరీ సంస్థల నుంచి మద్దతు లభించింది. కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.ప్రశాంత్‌కుమార్, ఒరాకిల్ ప్రతినిధులు, పలువురు ఎన్‌జీవో వాలంటీర్లు, రాధ, సంజయ్, గోవిందరాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బీమా.. కుటుంబానికి ధీమా !

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి | జిల్లాలో 1.10 లక్షల మంది మహిళా సంఘం సభ్యులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: స్వయం సహకార సంఘాల మహిళల పరిరక్షణ, వారికి భరోసా కల్పించేందకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వారు వ్యాపారపరంగా రాణించి ఆర్థికాభివృద్ధి సాధించేలా.. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్త్రీనిధి రుణాలను అందిస్తూ.. ప్రోత్సాహం అందిస్తోంది. మహిళా సంఘంలో సభ్యురాలిగా పేరు నమోదు చేసుకున్న వారికి బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది.

పేద కుటుంబాలపై భారం పడకుండా..

18 ఏళ్లు పైబడిన పేదలు సభ్యులుగా చేరవచ్చు. రుణం పొందిన సంఘ సభ్యురాలు మరణిస్తే.. ఆమెకు సంబంధించిన బాకీ కుటుంబసభ్యులు లేదా మిగతా సభ్యులపై భారం పడకుండా ప్రభుత్వం బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో సాధారణ మరణం పొందితే బ్యాంకు రుణం మాఫీ కావడం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.పది లక్షలు కుటుంబసభ్యులకు అందేలా అధికారులు బీమా పథకాలను అమలుచేస్తున్నారు.

స్త్రీనిధి సురక్ష..

మహిళా సంఘం సభ్యురాలు స్త్రీనిధిలో రుణం తీసుకుని కొంత చెల్లించి సాధారణ మరణం పొందితే తీసుకున్న రుణంలో మిగతా మొత్తం మాఫీ అవుతాయి. మృతి చెందిన సభ్యురాలు కట్టిన డబ్బులు తిరిగి వారి సంఘం ఖాతాలో జమచేస్తారు.

రుణ మాఫీ

బ్యాంకు లింకేజీ/ స్త్రీనిధి లేదా రెండింటిలో ఓ సంఘ సభ్యురాలు రుణం తీసుకుంది. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణంలో కొంత చెల్లించాక మరణించింది. మిగిలిన బాకీలో గరిష్టంగా రూ. 2 లక్షల వరకు మాఫీ అవుతుంది.



ప్రమాద బీమా..

మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరితే చాలు రుణం తీసుకోకున్నా.. ప్రమాద బీమా వర్తిస్తుంది. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.10 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రమాదంలో గాయపడి అంగవైకల్యం ఏర్పడితే బీమా పొందవచ్చు. సదరం ధ్రువీకరణ పత్రంలో 80 శాతానికి పైగా దివ్యాంగత్వం ఉండాలి. అప్పుడు (50శాతం) రూ. 5 లక్షల పరిహారం పొందవచ్చు. రుణం తీసుకున్న సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రమాద బీమాతో పాటు మరో బీమా రెండూ వర్తిస్తాయి.

కుటుంబానికి భరోసా..

ప్రభుత్వం కల్పించిన బీమా పథకాలతో మహిళా సంఘం కుటుంబాలకు భరోసా ఉంటుందని డీఆర్డీఏ అధికార వర్గాలు చెబుతున్నాయి. సాధారణ, ప్రమాదవశాత్తు మరణిస్తే సంబంధిత వీవోఏల ద్వారా సీసీకి పంపాల్సి ఉంటుంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో పలువురికి 2 రకాల బీమా లబ్ధి చేకూరినట్లు సమాచారం.

10,575 మహిళా సంఘాలు..
1.10 మంది సభ్యులు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 10,575 మహిళా స్వయం సహాయక సంఘాల ఉండగా.. 1,10,007 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో సెర్ప్‌లో 3,404 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 37,557 మంది సభ్యులు ఉన్నారు. మెప్మాలో 7,245 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 72,450 మంది సభ్యులు ఉన్నారు.

ప్రాణ సంకటంగా విద్యుత్ వైర్లు !

- చేతికందే ఎత్తులో వేలాడుతున్న తీగలు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికుల భయం



ధరణినగర్‌లో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఆల్విన్‌కాలనీ: అసలే వర్షాకాలం. విద్యుత్‌తో ఎప్పుడు ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్‌లో విద్యుత్ తీగలు ఇళ్ల ముందు చెట్ల పొదల్లో చేతికి అందేలా వేలాడుతూ ప్రాణ సంకటంగా మారాయి. వర్షాకాలంలో చెట్లు గాలులకు ఊగుతుంటే వైర్లు తెగి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడపాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలకు ఆనుకుని చెట్లు ఏపుగా పెరగటంతో కొమ్మలు కొట్టేసి వదిలేశారు. కొమ్మలు ఎండిపోయి విద్యుత్ తీగల మీద పడటంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. మరికొన్ని వీధుల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కాలనీలోని కనకదుర్గమ్మ దేవాలయం సమీపంలో, దాని పక్క వీధిలో, సొసైటీ కార్యాలయం సమీపంలో, హైటెన్షన్ లైన్‌లో విద్యుత్ తీగలు గుమ్మాల ముందు మామిడి తోరణాల్లా వేలాడుతున్నాయని పలువురు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదం జరగకముందే సరి చేయాలి



కాలనీలో చెట్ల కొమ్మల మధ్యలో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కేబుల్ వైరో, విద్యుత్ వైరో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్ అధికారులు ప్రమాదం జరగముందే వేలాడుతున్న వైర్లను సరి చేయాలి.

– గోపాల్, ధరణినగర్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్



సమావేశంలో పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో శనివారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పర్యటించారు. వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గేటెడ్ కమ్యూనిటీ నుంచి 100 అడుగుల రహదారి ప్రవేశపెట్టే ప్రయత్నాలు నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్న ప్రజలను ఇబ్బందులను గురి చేయొద్దన్నారు. ప్రణీత్ ఆంటీలియా కాంపౌండ్ వెనుక భాగంలోని సర్వే నంబర్ 170, ఉప సర్వే నంబర్లు, నిషేధిత జాబితాల్లో ఉన్నాయని, అదేవిధంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో మహేష్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీరాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసినగర్ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం కార్పొరేటర్ సబిహా బేగంను వార్డు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏ, బీ బ్లాక్‌లో మంచి నీటి సరఫరాలో ప్రెషర్ తక్కువగా ఉండటం వల్ల ఇబ్బంది పడుతున్నామని వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అంకిత్, విజయ్, దామోదర్ నేత, వెంకటరమణ, శ్రీను, రామారావు, కృష్ణారావు, మోయిత్, శ్రీకాంత్, కిషోర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పీఎస్‌లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

గచ్చిబౌలి: ఫీల్డ్ విజిట్‌లో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌లు పోలీస్ స్టేషన్లను శనివారం సందర్శించారు. గచ్చిబౌలి, రాయదుర్గం పీఎస్‌లో నలుగురు చొప్పున ట్రైనీ ఐపీఎస్‌లకు రిసెప్షన్, రికార్డులు, లాకప్, సీసీ కెమెరాల పరిశీలన ఎలా ఉంటుందో ఎస్‌హెచ్‌ఓలు వారికి వివరించారు. డయల్ 100 తో పాటు పీఎస్‌లకు ఫోన్లలో ఎలా ఫిర్యాదు చేస్తారు, పెట్రోల్ మొబైల్ సిబ్బంది ఎలా స్పందిస్తారు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, హోంగార్డు, కానిస్టేబుల్ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు వారు నిర్వహించే విధులను క్షుణ్ణంగా వివరించారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ సాయిబాబా ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, బ్రహ్మానంద గౌడ్, ప్రసాద్, పోశెట్టి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గచ్చిబౌలి: యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం సావిరిగం గ్రామానికి చెందిన అప్పల నాయుడు, అంకోలు రమా (21) దంపతులు. వీరు బతుకుదెరువు కోసం రాయదుర్గానికి వలస వచ్చారు. మల్కం చెరువు ఎదుట గుడిసెలో నివాసం ఉంటూ నర్సరీలో పని చేస్తున్నారు. శుక్రవారం రమా కడుపునొప్పిగా ఉందని తల్లి మంజులకు చెప్పి ఇంటి వద్దే ఉంది. తల్లి, భర్త మధ్యాహ్నం వచ్చి చూడగా నోట్ల నుంచి నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలో పడి ఉన్నది. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. కడుపు నొప్పి కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం





మాదాపూర్: 'ఆచార్య వందనం' కార్యక్రమంలో భాగంగా కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్యబృందం గురువు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార్ అవార్డు డాక్టర్ వేదాంతం సత్య నృసింహశాస్త్రిని శనివారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణన్ నాయిర్, గురువులు రఘుపాత్రుని శ్రీకాంత్, కొక విజయలక్ష్మి, నల్లమోలు లక్ష్మి, ప్రిన్సిపాల్ శోభారాణి గురువందన సమర్పించారు. రవి కూచిపూడి శిష్యబృందం మూషికవాహన, పుష్పాంజలి, మహాగణపతి, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు లాస్య, కమల, స్తుతి, నాగసాహితి, మధువైష్ణవి, జాహ్నవి, వర్ష, మణిమాల, నిదున, వాసవి, చార్వి తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న నేతలు

దుండిగల్: స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నేతలు శనివారం కలిసి వివిధ సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేవిధంగా చొరవ చూపాలన్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న బోనాల పండుగ ఉత్సవాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

గృహిణి ఆత్మహత్య

గచ్చిబౌలి: గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పంచవటి కాలనీలో కాంతా (24) భర్త అరుణ్ చౌదరితో కలిసి ఉంటోంది. గురువారం కృష్ణానగర్‌లో తల్లిగారి ఇంటివద్ద పూజకు వెళ్లి వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో పురుగుల మందు తాగడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దశలవారీగా చెరువుల సుందరీకరణ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను దశలవారీగా సుందరీకరిస్తున్నామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీద్‌బండలోని కుడికుంట చెరువుల సహే ఎన్‌జీఓ కల్పన రమేశ్‌తో కలిసి, ఇన్ఫోసిస్ సంస్థ సౌజన్యంతో చేపట్టే సుందరీకరణలో భాగంగా శనివారం చెరువు కట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల సుందరీకరణతో జీవవైవిధ్యం పెరగడమే కాకుండా పక్షుల వలసలు మొదలవుతాయని పేర్కొన్నారు. సహే ఎన్‌జీఓ కల్పన రమేశ్ మాట్లాడుతూ..ఇన్ఫోసిస్ సంస్థ కృషితో కుడికుంట చెరువు దశ మారిందన్నారు. అనంతరం కల్పన రమేశ్, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

గచ్చిబౌలి: దాడి కేసులో రాయదుర్గం పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఈనెల 8న అర్ధరాత్రి నాలెడ్జీ సిటీలో ఇషా హోటల్ వద్ద ఉన్న యూ టర్న్ విషయంలో సోమాలియాకు చెందిన అహ్మద్ (25) కు పలువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో అహ్మాద్‌ను కడుపులో కత్తితో పొడిచి నిందితుడు పరారైన విషయం తెలిసిందే. 2 బైక్‌లపై వచ్చిన నలుగురు యువకుల కోసం రాయదుర్గం పోలీసులు గాలింపు చేపట్టారు. బాలానగర్‌కు చెందిన అనీష్ (26)ను శనివారం అరెస్ట్ చేశారు. కత్తితో దాడి చేసిన యువకుడితో పాటు మరో ఇద్దరు యువకుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గాయపడిన అహ్మాద్ మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బోనాలకు పటిష్ట భద్రత

- అదనపు బలగాలతో బందోబస్తు
- మహిళా భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు
- సాక్షితో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి



ఏసీపీ రవికిరణ్ రెడ్డి

బోనాల ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి పోలీస్ శాఖ తన వంతు కృషి చేస్తుంది. మూసాపేట, బాచుపల్లి, నిజాంపేట పరిధిలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భక్తులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు అందజేస్తూ బోనాల పండుగ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేటట్లు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపునకు అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు. బోనాల ఉత్సవాలకు ఏర్పాటు చేయనున్న బందోబస్తుపై సాక్షితో ఏసీపీ మాట్లాడారు. – కూకట్‌పల్లి

మీ పరిధిలో ఎన్ని పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి, ఎంత మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు?

తమ పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. నలుగురు సీఐలు, ఇద్దరు ట్రాఫిక్ సీఐలు, సుమారు 40 మంది వరకు ఎస్ఐలు బోనాల ఉత్సవాల సందర్భంగా బందోబస్తులో విధులు నిర్వహిస్తారు. 500 మంది సిబ్బంది పాల్గొంటారు.

బోనాల బందోబస్తు ఎలా ఉంటుంది?

బోనాల బందోబస్తు పకడ్బందీగా కొనసాగుతుంది. 20, 21 తేదీల్లో బోనాల ఉత్సవాల్లో ముఖ్యంగా మహిళలకు ఎలాంటి ఆటంకం లేకుండా బోనాలను అమ్మవార్లకు చెల్లించే విధంగా తగు ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకోసం మహిళా సిబ్బందిని కూడా ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తాం.

మహిళా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

మహిళా భక్తుల విషయంలో దేవాలయాల వద్ద ఉన్న సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. మహిళలకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేసి బోనాలను నిర్వహించేందుకు కట్టు దిట్టమైన ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా దేవాలయాల్లో వాహన పూజ చేసే వారు క్యూ పద్ధతి పాటించే విధంగా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

ఆలయ కమిటీలకు మీరు ఏ విధమైన సూచనలిస్తారు?

విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఉత్సవ నిర్వాహకులు, ఆలయ కమిటీలు పూర్తి స్థాయిలో సహకరించాలి. శాంతి భద్రతల సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తగానే వెంటనే సంబంధిత సిబ్బందికి తెలియజేస్తే ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తాము. ఆలయాల వద్ద పోలీసుల సహకారాన్ని తీసుకుని ఉత్సవాలను శాంతియుతంగా చేసుకునే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలి.